# షాక్ ట్రీట్‌మెంట్

**ఆ** హాస్పిటల్ ఆవరణలోకి అడుగుపెట్టగానే నాలో ఓ రకమైన స్పందన కలుగుతుంది. లోపలకు వెళ్ళేముందు ఒకసారి ఆ విశాలమైన భవనాన్ని అటూ ఇటూ పరికించి చూస్తాను. ఆ క్షణం కించిత్ గర్వంతో కూడిన ఆనందం మనసులో కెరటంలా ఎగసిపడుతుంది.

అక్కడ నేను డాక్టరుగా జాయినయిన రెండు నెలలనుండీ ప్రతీరోజూ ఆ అనుభూతి కలుగుతుంది. వృత్తిని అమితంగా అభిమానించే వాళ్ళెవరికైనా అది సహజమే అనుకుంటా.

నా చిన్నప్పుడొకసారి ఎవరో బంధువుల్ని పరామర్శించడానికి అమ్మ హాస్పిటల్‌కి వెళ్తూ నన్ను కూడా వెంటబెట్టుకెళ్లింది. అప్పుడు డాక్టరుగారు వాళ్ళ రూములోనే వున్నారు.

ఒక పెద్దావిడ రెండు చేతులూ జోడించి డాక్టరు గారికి నమస్కారం చేస్తూ "మీరు మా పాలిటి దేవుడు బాబూ... మావాడికి ప్రాణం పోశారు. పునర్జన్మనిచ్చారు" అంది.

డాక్టరుగారిపట్ల ఆవిడ కళ్ళల్లో కనిపించిన గౌరవాభిమానాలనూ, పూజ్యభావాన్నీ చూసినపుడు నేనూ డాక్టరునవ్వాలనే కోరిక కలిగింది.

ఆ తర్వాతెప్పుడు హాస్పిటల్‌కి వెళ్ళినా తెల్లని దుస్తుల్లో వున్న నర్సుల్నీ, తెల్లటికోట్లు వేసుకుని తిరిగే డాక్టర్లనీ చూస్తుంటే.. వాళ్ళు నా కళ్ళకి దేవదూతల్లాగే అనిపించేవాళ్ళు.

వాళ్ళెంత అదృష్టవంతులో అనుకునేవాడిని. ఎలాగైతేనేం నేనూ ఆ జాబితాలోకి చేరగలిగాను.

కాకపోతే... నా చదువు పూర్తవడానికి మా కుటుంబం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంది. బాగా అప్పులు చేయాల్సి వచ్చింది.

ఆ అప్పుల్ని తొందరలోనే తీర్చెయ్యగలనన్న ధీమా నాకువుంది. కారణం నగరానికంతటికీ ఆధునిక వైద్యసదుపాయాలున్న హాస్పిటల్‌గా పేరున్న పరమేశ్వరంగారి హాస్పిటల్‌లో నాకు అవకాశం లభించింది. అది నా అదృష్టమే మరి.

కారిడార్‌లో ఒక మూలవున్న గుంపు దగ్గర్నుండి వస్తోన్న డాక్టర్ రమణని సంగతేమిటని అడిగాను.

"పాపం ఎవరో కుర్రాడు, రోడ్డు దాటుతూండగా ఆటో గుద్దేసింది. తలకు బాగా దెబ్బ తగిలింది. ఆలస్యం కాకుండా వెంటనే ఆపరేషను జరిగితే బ్రతికే అవకాశం వుంది. డాక్టర్ ధనుంజయ్‌గారైతేనే బెస్టు. అదృష్టంకొద్దీ ఈ రోజు మన హాస్పిటల్‌కి ఆయన విజిట్ వుంది. మరో టెన్ మినిట్స్‌లో ఆయన వస్తున్నారు. కానీ..."

"మరి ప్రోబ్లెమ్ ఏమిటీ?" ఆదుర్దాగా అడిగాను.

"మన ఎమ్.డిగారి సంగతి నీకింకా సరిగ్గా తెలియదు. ఇక్కడ తన ఫ్యామిలీ మెంబర్స్‌కయినా సరే ఏమాత్రం కన్సెషన్ ఉండదని, రూలంటే రూలే అని అంటూంటారు. ఆపరేషన్ జరగాలంటే ముందు సిక్స్‌టీన్ థౌజండ్స్ కట్టి అడ్మిట్ చేయమన్నారు. తనవాళ్ళ వివరాలు చెప్పడానికి ఆ కుర్రాడు స్పృహలో లేడు. తీసుకువచ్చిన నలుగురి దగ్గిరా కలిపినా పదిహేను వందలకు మించిలేవు" అని విషయాన్ని నిట్టూరుస్తూ చెప్పాడు.

నేను నిర్ఘాంతపోయాను.

ఒక్క నిముషమయినా ఆలస్యం చేయకుండా ఎమ్.డి. పరమేశ్వర్రావుగారి రూముకి పరుగులాంటి నడకతో వెళ్ళాను. హడావుడిగా విష్ చేసి –

"సర్... ఆ యాక్సిడెంట్ కేస్ చాలా సీరియస్. ఇక్కడికి దగ్గర్లో మరో హాస్పిటల్ కూడా లేదు... వెంటనే ఆపరేషన్" అంటూ నేను చెప్పబోతూండగానే ఆయన మధ్యలో అడ్డం వచ్చారు.

"సీ.. మిస్టర్ శశికాంత్. నేనేదయినా నాలుగు సార్లు చెప్పను. ఆల్రెడీ రమణకు చెప్పాను. మళ్ళీ నువ్వెందుకు కలుగచేసుకుంటున్నావ్? హాస్పిటల్‌కయినా, హోటల్‌కయినా మనరేంజిని బట్టి వెళ్ళాలి. బాగా ఆకలిగావుందని దగ్గర్లోవున్న స్టార్ హోటల్‌కి వెళ్తే ఏమవుతుంది. తలకుమించిన భారమవుతుంది. అది తెలుసుకోవాలి. బైకుమీదయినా కాదు... కాలినడకన వెళ్తున్న వాడికి యాక్సిడెంట్ అంటే, అతని స్టేటస్ తెలుస్తోందిగా. ఎవరి పూచీమీద మనం అడ్మిట్ చేసుకుంటాం?" ఆయన మొహం కఠినంగా మారింది.

"ఇక్కడ న్యూసెన్స్ క్రియేట్ చేయకుండా వెంటనే అతన్ని మరోచోటకు తీసుకుపొమ్మని వాళ్ళకి చెప్పిరా" అని ఆదేశించినట్లు చెప్పాడు.

నేనిక చేసేదేం లేదని నాకు అర్థమైపోయింది. వెంటనే బయటకు వచ్చేశాను.

మొహంనిండా రక్తపు చారికలతో యాక్సిడెంట్ అయిన కుర్రాడి పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. వాళ్ళు నలుగురూ నావేపు ఆదుర్దాగా చూస్తోంటే, ఏం చెప్పాలో తెలియని నిస్సహాయ పరిస్థితిలో ఉండిపోయాను.

అప్పుడే అతనికి కొంచెం స్పృహ వచ్చింది. కాబోలు... కొద్దిగా తెరుచుకున్న కనురెప్పలు అల్లల్లాడాయ్! పెదవులు అస్పష్టంగా కదులుతున్నాయి కానీ శక్తి చాలడం లేదేమో, మాట వినిపించడం లేదు. ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నా, చెప్పలేక పోతున్న అతని పరిస్థితి చాలా దారుణంగా ఉంది! రెండు మాటలు చెప్పగలిగినా చాలు, అతని తల్లిదండ్రుల వివరాలు తెలుస్తాయి.

నేను కొంచెం ఒంగి అతని పెదవులకు దగ్గిరగా నా చెవి ఆనించాను. నేను వెంటనే ఆపరేషన్ థియేటర్‌కి వెళ్లి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేయమని అక్కడున్న సిబ్బందికి చెప్పేశాను.

ధనుంజయ్‌గారు రాగానే చేయాల్సిన ఆపరేషను గురించి రమణకు సలహాలిచ్చేశాను.

చకచక ఈ పనులన్నీ ముగించేసి నిదానంగా పరమేశ్వరంగారి రూములోకి వచ్చాను.

రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చుని ఏదో మేగజైన్ తిరగేస్తున్న ఆయన నన్ను చూస్తూనే

“మిష్టర్ శశికాంత్... నీకీ పూట నువ్వు అటెండవ్వాల్సిన కేసులేం లేవుగా... నేను మధ్యాహ్నం ఫ్లైట్‌కి బెంగుళూరు వెళ్ళాలి. ఈ లోపున నువ్వీ బిల్లులన్నీ వెరిఫై చేయాలి....” అంటూ టేబుల్‌పైనున్న ఒక ఫైలును ముందుకు జరిపారు.

ఆ ఫైలుపై చేయి పెట్టానేగానీ ఏం మాట్లాడ లేకపోయాను. లోలోపలి నుండి ఏవో హాహాకారాలు! మొహం నిండా విపరీతంగా చెమటలు!

ఆయన నన్ను చూసి ఒక క్షణం ఉలిక్కిపడ్డారు. “అరె... అలా వున్నావేంటి? ఏమయింది?” అంటూ తనెదురుగా ఉన్న కుర్చీలో కూర్చోమని చెప్పారు. కూలబడ్డట్టుగా కూర్చున్నాను.

టేబుల్‌పైనున్న బాటిల్‌లో నుండి గ్లాసులోకి చల్లటి మినరల్ వాటర్‌ని ఒంపి అందించారు. తీసుకుని గడగడా తాగేశాను.

“సర్...” అంటూ నేను మాట్లాడబోతోంటే – “నువ్వుండు. నన్ను చెప్పనీ...” అంటూ అడ్డం వచ్చి “నువ్వు చాలా సెంటిమెంటల్ అన్నమాట! కుర్రాడివి కదా... అలాగే ఉంటుంది! కొన్నాళ్ళుపోతే నువ్వే రాటుతేలతావు! ఈ మనుష్యుల్ని, పరిస్థితుల్ని చూసి నాలుగు రాళ్లు సంపాదించడమే ముఖ్యమనే విషయం నీకూ అర్థమౌతుందిలే! ఏ మనిషైనా తన చదువుకు తగిన ఉద్యోగాన్ని వెతుక్కుని నాలుగు డబ్బులు సంపాదించుకోవాలనుకుంటాడు. డాక్టర్లయినా అంతే. వ్యాపారస్థుడైనా అంతే... తన పెట్టుబడికి తగ్గ లాభాలను కోరుకుంటాడు! అది మనకున్న హక్కేగానీ తప్పేమీ లేదు!”

నేను “సర్...” అంటూ మొదలుపెట్టబోతోంటే, “ఆగవయ్యా... నీకంటే వయసులో పెద్దవాడిగా నా అనుభవంతో చెబుతున్న ఈ నాలుగు మాటల్నీ కాస్తంత ఓపిగ్గా వినూ...” అంటూ నా ప్రయత్నాన్ని సాగనివ్వలేదాయన. ఆదుర్దాలో మొహానికి పడుతున్న చెమటల్ని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ నిస్సహాయంగా ఉండిపోయాను.

“చదువుకోసం అయిన ఖర్చు లక్షల్లో వుంటే, ఈ హాస్పటల్ నిర్మాణానికి, ఎక్విప్‌మెంట్స్‌కీ పెట్టుబడి కోట్లలో అయింది! ఇంత ఖర్చు పెట్టి, ధర్మాత్ముడనే పేరుకోసం పాకులాడి ఉచిత వైద్యం మొదలు పెడితే మనం పూర్తిగా మునిగిపోతాం... రోడ్డున పడతాం! నిజమా.. కాదా?”

“నిజమే సర్... కానీ...”

“ఇక నీ సందేహాలన్నీ అవతలబెట్టు. ఇక్కడికి అందరూ రకరకాల రోగాలతో వచ్చేవాళ్ళే! వాళ్ళందరి బాధలూ నువ్వు పట్టించుకుంటూ కూర్చుంటే ఇక నీకు స్థిమితం అనేదే ఉండదు. మన పని మనం చేసుకుంటూ తామరాకు మీది నీటిబొట్టులా ఉండగలగాలి!” అంటూ ఒక క్షణం నావైపు పరిశీలనగా చూశారు.

“నేనింత చెబుతున్నా నీ ఫేస్‌లోని ఆ ఫీలింగ్ మాత్రం అలాగే ఉంది! నీ మూడ్ మారడానికి నేనిప్పుడే చదివిన ఓ జోక్ చెప్పనా?” అని టేబుల్ మీదున్న మేగజైన్‌ని చేతిలోకి తీసుకున్నారు.

ఆ కుర్రాడి పరిస్థితిని తలుచుకుంటూ నేను ఆందోళనతో తలక్రిందులవుతోంటే, ఈయనేమో చాలా కూల్‌గా జోక్ చెబుతానంటున్నారు!

జోక్స్ చెప్పుకుంటూ నవ్వుకునే సమయమా ఇది...?! తామరాకు మీది నీటిబొట్టులా ఉండటమంటే ఇదా...? నివ్వెరపాటుతో చూస్తోంటే ఆయన చిరునవ్వుతో చెప్పారు.

“ఒక పేషెంట్‌భర్తతో డాక్టర్ ‘ఈ సంగతి మీకు చెప్పక తప్పదు... మీ ఆవిడ రెండు రోజులకంటె ఎక్కువ బ్రతకదు. మీకు బాధగానే ఉంటుంది. తప్పదు. ఓర్చుకోవాలి’ అని చెబితే దానికతడు – ‘ఫరవాలేదు డాక్టర్... ఇన్ని సంవత్సరాలు ఓర్చుకున్నవాడిని ఇక రెండు రోజులు ఆమాత్రం ఓపిక పట్టలేనా?’ అని జవాబు చెప్పాడట. జోక్ ఎలా ఉంది?” నవ్వుతూ అడిగారు.

నాకు నవ్వు రాలేదు. నాలో లోలోపల చెలరేగుతున్న హాహాకారాల్ని అదిమిపెడుతూ మెల్లగా “సర్... మీ మాటలు వింటోంటే, నేనెప్పుడో చాలానాళ్ళ క్రితం చదివిన ఒక కథ గుర్తుకు వస్తోంది. మీకు చెప్పనా...?” అనగానే ఆయన మొహంలో అప్రసన్నత చోటు చేసుకుంది.

ఆ విషయాన్ని నేను గమనించనట్లుగానే “మీ టైము ఎక్కువ తీసుకోను సార్... క్లుప్తంగా ఒకే ఒక్క నిముషంలో చెప్పేస్తాను. నాకు బాగా నచ్చిన కథ” అంటూ మొదలు పెట్టేశాను.

“ఇద్దరు జాలరి దంపతులు సముద్రంలో కొట్టుకుపోయి ప్రాణాపాయంలో పడిన పిల్లాడిని తీసుకుని ఒక హాస్పటల్‌కి వస్తారు. అది సామాన్యులకి అందుబాటులో ఉండే హాస్పటల్‌కాదు.

పిల్లాడిని కాపాడమని ఎంత కాళ్ళావేళ్ళా పడినా ఎవరూ పట్టించుకోరు. డాక్టరు ఏదో కాన్ఫరెన్స్‌కని హడావుడిగా వెళ్ళిపోతోంటే వాళ్ళు పిల్లాడిని చూడమని విలపిస్తూ ప్రాధేయపడతారు. కానీ ఆయన వాళ్ళ గోడు వినిపించుకోకుండా, కనీసం వాళ్ళవేపైనా సరిగా చూడకుండా కారులో వెళ్లిపోయి, ఆ తర్వాతెప్పటికో హాస్పటల్‌కి తిరగి వస్తాడు.

చనిపోయిన పిల్లాడిని పెట్టుకుని రోదిస్తూ వాళ్ళింకా అక్కడే ఉంటారు.

వాళ్లు తీసుకొచ్చింది తన కొడుకునే అనే సంగతి అప్పుడు ఆ డాక్టరుకి తెలిసి షాక్‌కి గురై బిగుసుకుపోతాడు!

తన కొడుకు చనిపోయాడనే విషయానికే కాదు... ఎవరి కన్నబిడ్డనో కాపాడటానికి ఆ జాలరి దంపతులు పడిన తాపత్రయానికీ, వాళ్ళలోని మానవత్వపు వెలుగులకు మాత్రమే అతనంత షాక్‌కి గురయ్యాడంటూ రచయిత్రి కథని ముగించారు. ఎప్పుడో చదివినదవడం వలన సరిగా గుర్తు లేక బాగా చెప్పలేకపోయానుగానీ కథ చాలా బావుంటుంది సార్" అన్నాను.

"ఇప్పుడు ఈ కథ నీకెందుకు గుర్తుకు వచ్చిందీ... నాకెందుకు చెప్పినట్లు...?" పరమేశ్వరం గారి మొహంలో చిరాకు స్పష్టంగా కనుపించింది.

ఇక నేను నాలోని అలజడిని అణుచుకోలేక పోయాను. వణికే గొంతును స్వాధీనంలోకి తెచ్చుకుంటూ మెల్లగా చెప్పేశాను.

"యాక్సిడెంట్ అయిన అబ్బాయి ఎవరో కాదు సర్.. మీ అబ్బాయ్! ఇప్పుడు నేను వెళ్లి చూసినప్పుడు కొంచెం స్పృహలోకి వచ్చాడు.

పదిరోజుల క్రితం స్టేట్స్ నుండి వచ్చి మొన్న వాళ్ళ అమ్మమ్మగారి వూరెళ్ళిన మీ అబ్బాయికి ఎవరో ఫ్రెండు తన బర్త్‌డేకి రమ్మని ఫోనుచేస్తే, మీకు చెప్పకుండా వచ్చేశాడట. ఐస్‌క్రీమ్ పార్లర్‌కి వెళ్తూండగా..." నాకంఠమూ బొంగురుపోయింది.

తన కాళ్ళ క్రింద బాంబు పేలినట్లుగా "వ్వా...ట్" అంటూ ఆక్రందనలా అరిచి "ఈ విషయం ఇంత నిదానంగా చెబుతున్నావ్?" అని గుడ్లురుముతూ చూశారు.

"నేను ఆపరేషన్‌కు అన్ని ఏర్పాట్లూ చేసేశాను సర్. ధనుంజయ్‌గారు ఆపరేషను ప్రారంభించడానికి మీ అనుమతి తప్పనిసరి అని రమణ అంటున్నాడు... మీరు చెప్పండి సార్..." అంటూ హడావుడిగా నా సెల్‌ఫోను తీసి రమణకు రింగ్ చేసి పరమేశ్వరంగారికి ఇచ్చాను.

కన్నీళ్ళు ధారాపాతంగా కారిపోతుంటే పరమేశ్వరంగారు సెల్‌ఫోన్ అందుకుని కీచుగొంతులో "శశికాంత్ చెప్పినా కూడా ఫూల్‌లా నా పర్మిషన్ కావాలంటున్నావా? వాట్ నాన్సెన్స్.. ఎంత ఖరీదు మందులైనా సరే... ఆc...ఆc..." అంటూ మాట్లాడుతోంటే నేను ఫోను తీసుకుని ఆపరేషన్ పూర్తవగానే నాకు రింగ్ చేయమని చెప్పి ఆఫ్ చేసేశాను.

పరమేశ్వరంగారు వెళ్లబోతుంటే "మీరు చూసి తట్టుకోలేరు సార్... వద్దు" అన్నాను.

"ఇందాకనే థియేటర్‌లోకి తీసుకెళ్ళారు కాబట్టి ఇక ఆపరేషను మొదలు పెట్టేస్తారు. మీరు ఇక్కడ ఉండటమే మంచిది. ఆపరేషన్ జరగకపోతేనే ప్రమాదం కానీ ఇప్పుడిక భయపడాల్సిందేం లేదు సార్. ధనుంజయ్‌గారు చేసిన ఏ ఆపరేషనయినా సక్సెస్ కాకపోవడమంటూ లేదని మీకూ తెలుసు గదా సార్..." అంటూ ఆపాను.

ఆందోళనతో అస్థిమితంగా తిరుగుతోంటే ఆయన్ను పట్టుకుని మెల్లగా కుర్చీలో కూర్చోబెట్టాను. చల్లటి మంచినీళ్ళు అందించాను.

టేబుల్‌పై రెండు చేతులూ ఆనించి తలపట్టుక్కూర్చున్నారు పరమేశ్వరంగారు.

"వర్రీ అవ్వాల్సిందేం లేదు సర్. ... మీరు నిశ్చింతగా ఉండండి.." అంటూ ధైర్యం చెప్పబోయాను.

"నీకేం తెలుస్తుందయ్యా నా బాధ! వాడు... నా కొడుకు... నా ప్రాణం.. చావు బతుకుల మధ్య కొట్టుకుంటూంటే.. నేను స్థిమితంగా ఎలా ఉండగలను? మామూలుగా కాదు... వాడిని నా గుండెల మీద పెట్టుకుని పెంచాను! వాడికేదయినా అయితే నేను తట్టుకోలేను! వాళ్ళమ్మ బ్రతకలేదు..." ఆయన గొంతు పూడుకుపోయింది.

కన్నబిడ్డ మృత్యుముఖంలో ఉంటే తండ్రి హృదయం అలా తల్లడిల్లపోవడం సహజమే!

ఏం మాట్లాడాలో నాకూ తోచలేదు. ఆ పరిస్థితి నాకూ దుర్భరంగా ఉంది.

తప్పదు. కాసేపు ఓపిక పట్టాలి. ఆపరేషన్ సక్సెస్ అవుతుందన్న నమ్మకం నాకుంది!

"సర్ ... మీరలా నిశ్శబ్దంగా ఉంటే ... అరగంట సమయమే భారంగా ఆరు గంటలుగా అనిపిస్తుంది. మాట్లాడుతుంటే టెన్షన్ కొంచెం తగ్గుతుంది. సమయమూ తొందరగా గడిచినట్లనిపిస్తుంది".

నేను అన్న మాటలకు పరమేశ్వరంగారు నా వైపు విచిత్రంగా చూశారు.

"పోనీ ... నేనే ఏదో ఒకటి మాట్లాడుతూంటాను. వినండి .. చాలు. మీమైండ్ డైవర్ట్ చేయడానికే అనుకోండి .. లేక మరో కారణమో అనుకోండి.." అంటూ నేను చెప్పాలనుకున్న విషయానికి నాందీ ప్రస్తావన చేసాను. "ఇందాక మీరు మీ అనుభవంతో నాకు నాలుగు మాటలు చెప్పారు. ఇప్పుడు నేనూ మీతో నా ఆలోచనలు పంచుకుంటున్నట్లుగా రెండు మాటలు చెబుతాను.

కొన్నాళ్ళుపోతే నేనూ రాటుదేలి డబ్బు ప్రాముఖ్యతను తెలుసుకుంటానని అన్నారు. చదువు పూర్తిచేయడానికి నేను పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు... అలాంటిది డబ్బు విలువ నాకెందుకు తెలియదు సార్! బాగా సంపాదించాలనీ, ఇల్లూ వాకిలీ, కారూ లాంటివన్నీ సమకూర్చుకోవాలనే కోరికలు నాకూ ఉన్నాయి. ఈ కోరికల్ని సాధించుకున్నప్పుడు కలిగే ఆనందంతోపాటు నిస్సహాయులైన రోగుల ప్రాణాలను కాపాడగలిగినప్పుడు పొందే అపురూపమైన

ఆనందమూ నాకు ముఖ్యమేననిపిస్తుంది! మన సమాజం ఉపాధ్యాయుడికీ, వైద్యుడికీ పెద్దపీట వేసి కూర్చోబెట్టింది! అంతేకాదు... వైద్యో నారాయణో హరిః అంటూ సాక్షాత్తూ భగవత్ స్వరూపంగా కీర్తించింది!

అంటే... సమాజం పట్ల అతని నైతిక బాధ్యత అందరికంటె కొంచెం ఎక్కువని హెచ్చరిక చేసినట్లుగా నాకనిపిస్తుంది! డబ్బుకంటే విలువైనది ప్రాణమేకదా సార్... ప్రాణాలు పోయాక ఎంత డబ్బు కుమ్మరించినా తిరిగి రావుగా...?"

"ఏంటయ్యా... ఏం మాట్లాడుతున్నావ్? ఏవో కొత్త సంగతులు చెబుతున్నట్లుగా .. ఏమిటిది? ఇవన్నీ నాకు తెలియని సంగతులనుకుంటున్నావా?" చిరాగ్గా నొసలు చిట్లించారు.

"నిజమే సార్.. మీకు తెలియనివికావుగానీ, అనుభవంలోకి రానివని మాత్రం అనిపించింది !" అంటూ లేచి నిలబడి నా దగ్గిరున్న బ్యాగ్‌లో నుండి చెక్కుబుక్కు, తెల్ల కాగితం తీశాను. పదహారు వేలకి చెక్కు రాసి, కాగితం మీద రాజీనామా రాసి ఆయన ముందు పెట్టాను.

ఇక అప్పుడు బరువు తీరినట్లుగా తేలికగా, స్థిమితంగా అనిపించింది.

ఆ రెండింటినీ పరమేశ్వరంగారు మార్చి మార్చి చూసి "ఏమిటిది?" అన్నారు విస్మయంగా.

"బాస్‌గా మీరిచ్చిన ఆదేశాన్ని పాటించకుండా మిమ్మల్ని తప్పుదోవ పట్టించినందుకు రాజీనామా చేస్తున్నాను. యాక్సిడెంట్ అయిన అబ్బాయిని అడ్మిట్ చేసినందుకు ఫీజుగా చెక్కు ఇచ్చాను. రేపు ఫస్ట్ కాబట్టి నా శాలరీ నా అకౌంట్‌కి క్రెడిట్ అవుతుందని రేపటి తారీఖుతో ఇచ్చాను".

ఆయన అర్థం కానట్లుగా అయోమయంగా చూస్తోంటే మళ్ళీ చెప్పాను "ఆ అబ్బాయి తన వాళ్ళ వివరాలు చెప్పాలని పాపం ప్రయత్నించాడు గానీ చెప్పలేకపోయాడు. మరో హాస్పటల్‌కి తీసుకెళ్ళేలోపుగానే అతనికేమైనా అయితే... సమయానికి వైద్య సదుపాయం అందక చనిపోయాడనే బాధ అతని తల్లిదండ్రులను జీవితాంతం వేధిస్తుంది! అతనితో ఏ సంబంధం లేకపోయినా మానవత్వంతో హాస్పటల్‌కి తీసుకువచ్చిన నలుగురూ తమ జేబుల్లో వున్న మొత్తాన్నిచ్చి రక్షించమని ప్రాధేయపడుతోంటే.. డాక్టరునై వుండీ నేను ఏమీ చేయలేకపోతే.. ఆ జ్ఞాపకం జీవితాంతం నన్ను ముల్లులా గుచ్చుతూనే ఉంటుంది. అందుకే నేను స్వతంత్రంగా నిర్ణయం తీసేసుకున్నాను. స్టార్ హోటల్‌కి వెళ్ళడమూ, అత్యవసర సమయంలో పేషెంట్‌ను కార్పొరేట్ హాస్పటల్‌కి తీసుకు రావడమూ ఒకటి కానేకాదు సార్. ఇక్కడ సమయం అనేది చాలా ముఖ్యం. అది ఏ రకమైన హాస్పటల్ అంటూ మీమాంసచేస్తే, ప్రాణాలే పోవచ్చు! అతను మీ అబ్బాయేనని చెప్పి మీకు ఒక షాక్ ఇచ్చి ... అతని తల్లిదండ్రుల దుఃఖాన్ని మీ అనుభవంలోకి తెప్పించాలనుకున్నాను! అప్పుడు నా నిర్ణయం సరైనదేనని మీరూ తెలుసుకోగలుగుతారేమోనని నాకు అనిపించింది!"

పరమేశ్వరంగారి మొహం వివర్ణమైపోయింది! ఇంతెత్తున ఎగిరిపడినట్లుగా "వ్వా..ట్!" అంటూ గట్టిగా అరిచారు.

"అవును సార్.. అతను మీ అబ్బాయి కాదు. మొన్న మీరు ఫోనులో మీ అబ్బాయి స్టేట్స్ నుండి వచ్చి వాళ్ల అమ్మమ్మగారి ఊరువెళ్లినట్లుగా చెప్పడం విన్నాను. దాన్ని ఇలా ఉపయోగించుకున్నాను గాని అతను మీ అబ్బాయి కాదు.

కోటీశ్వరులకైనా, కార్మికులకైనా కన్నబిడ్డ మృత్యుముఖంలో ఉంటే కలిగే బాధ ఒక్కలాగే ఉంటుంది! అతని తల్లిదండ్రులు ఈ హాస్పటల్ ఖర్చుల్ని భరించగలిగే వాళ్ళయితే ఫరవాలేదు. కాకపోయినా సంతోషమే. ఆ ఖర్చుల్ని నేనే భరిస్తాను".

ఈ నాలుగు మాటలూ చెప్పేసి గుమ్మం వేపు అడుగులు వేస్తూ ఒక క్షణం ఆగి మళ్ళీ చెప్పాను

"సార్... కొద్దిసేపయినా మిమ్మల్ని ఆందోళనకు గురిచేసినందుకు నా మీద మీకు కోపం రావడం సహజమే. కానీ మీరు మరొకందుకు నాకు థ్యాంక్స్ చెప్పుకోవాలి ఎందుకంటే – నేను ఆ మధ్య పేపరులో ఇలాంటి కేసు గురించే చదివాను. యాక్సిడెంట్ అయిన కుర్రాడిని ఫీజు కారణంగా ఆడ్మిట్ చేసుకోకుండా ఒక హాస్పటల్ వాళ్లు పంపేస్తే, మరో హాస్పటల్‌కి తీసుకెళ్ళేలోపుగానే అతను మరణించాడని. అందువల్ల కేసువేస్తే, ఆ హాస్పటల్ యాజమాన్యం నష్టపరిహారంగా పది లక్షలివ్వాలని కోర్టు తీర్పు ఇచ్చింది! అంటే.. మీకలాంటి పరిస్థితి ఎదురవ్వకుండా నేను కాపాడానని అనుకోండి!"

కత్తి వేటుకి నెత్తురు చుక్కలేనట్లుగా పాలిపోయిన మొహంతో, షాక్ తగిలినట్లుగా బిగుసుకుపోయి నిలబడిన పరమేశ్వరంగారి వైపు చిరునవ్వుతో చూసి బయటకు వచ్చేశాను.

ఆమర్నాడు.. రూములో కళకళలాడే మొహంతో తల్లిదండ్రులతో కబుర్లు చెప్పుకుంటున్న ఆ అబ్బాయిని చూసినప్పుడు... నా మనసులో రెపరెపలాడిన అపురూపమైన ఆనందం డబ్బుతో లభించేది కాదు! అంత విలువైనది!

స్వాతి మంత్లీ. ఆగష్టు, 2007